

వంగర తహశీల్దార్ సస్పెన్షన్

ప్రజాశక్తి-వంగర, విజయనగరం

వంగర ఇన్చార్జి తాహశీల్దార్గా విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహశీల్దార్ హెచ్. రమణారావును జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రమణారావు విధి నిర్వహణలో ఉండగా, కార్యాలయంలోనే మద్యం సేవించి, నేలపై నిద్రపోయినట్లు వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ ఈ ఆదేశాలను జారీ చేశారు. వంగర మండలానికి ఇన్చార్జి తాహశీల్దారుగా, రాజాం తాహశీల్దార్ రాజశేఖర్కు అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ వ్యవహారంపై విచారణాధికారిగా కెఆర్సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మురళిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా రమణారావుపై గతంలోనూ పలు అవినీతి ఆరోపణలు వచ్చాయి. సక్రమంగా విధులు నిర్వహించకుండా వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే వారినుంచి దండిగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో సివిల్ సప్లయి విభాగంలో పనిచేసినప్పుడు కూడా ఆయనపై అధికారులు చర్యలు చేపట్టారు.

గురువులకు బోధనేతర పనులు



ఒకప్పుడు పాఠాలు చెప్పడంలో బిజీబిజీగా ఉండే గురువులు నేడు యాప్, ఆన్లైన్ పనులతో కుస్తీ పడుతున్నారు. పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయులతో బోధనేతర పనులు చేయిస్తూ ఉపాధ్యాయ వృత్తినే పాలకులు అవమానిస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారు. ప్రభుత్వ తీరుపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాలు కలెక్టరేట్ వద్ద ధర్నాలు, వినతిపత్రాలు ఇచ్చి నిరసన తెలుపుతున్నారు.

- అటకెక్కుతున్న పాఠ్యాంశాల బోధన
- ప్రభుత్వ తీరుపై ఉపాధ్యాయుల ఆగ్రహం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న టిడిపి కూటమి ప్రభుత్వం విద్యారంగ మూలాలను దెబ్బతీసేలా ఉపాధ్యాయులను విద్యాబోధనకు దూరం చేస్తుండటం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. గురువులపై బోధనేతర పనుల భారం రోజురోజుకూ పెరుగుతోంది. దీనిపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నారు. ప్రతిరోజూ వాట్సాప్లో అర్జెంట్, మోస్ట్ అర్జెంట్ అంటూ మెసేజ్లు, ఆన్లైన్ పనులు చేయాలని ఆదేశాలిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 1717 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపు ఏడు వేల మందికి పైగా ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వేసవి సెలవుల అనంతరం జూన్ 12 నుంచి పాఠశాలలు పున్రప్రారంభమయ్యాయి. ఆ తర్వాత స్కూల్ ఆర్గనైజేషనల్ టీములు (ఎస్టి), ఎంటిఎస్, బదిలీల కౌన్సెలింగ్ నిర్వహణతో 15 రోజులు గడిచిపోయాయి. అనంతరం గిన్నిస్ రికార్డు పేరిట జూన్ 21న చేపట్టిన యోగాంధ్ర కోసం పాఠశాలల్లో ముందస్తు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో ఉపాధ్యాయులను, విద్యార్థులను భాగస్వాములను చేశారు. గత నెల 10న నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ (పిటిఎం)కు పది రోజులు ముందుగానే సన్నాహక కార్యక్రమాలు నిర్వహించారు. ఇవి ముగించుకుని ఉపాధ్యాయులు హమ్మయ్యా అనుకునేసరికి ఈనెల 14 నుంచి స్కూల్ లీడర్షిప్, ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం (ఎఫ్ఎల్ఎన్) వంటి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించారు. ఇటువంటి వాటితో తమ సమయం వృథా అవుతోందని, ఆనివార్యంగా బోధనకు దూరమవ్వాల్సి వస్తోందని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. ఓ పక్క ఉపాధ్యాయులు అనేక రకాల పనులతో సతమతం కాగా, విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు సైతం సమయం సరిపోను పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విద్యారంగం, పాఠశాల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఒకపక్క యాప్, మరోపక్క ఆన్లైన్ పనులు పాఠశాల విద్యాశాఖలో ఉన్న అన్ని యాప్లను ఒకే వేదికపైకి తీసుకొచ్చి లీప్ యాప్ రూపొందించారు. దానిలోనే ఐఎంఎంఎస్, స్టూడెంట్ కిట్స్, మెగా పిటిఎం వంటివన్నీ ఉంచారు. సర్వర్ సక్రమంగా లేకపోవడంతో ఆన్లైన్లో టీచర్ ఫొటోతో హాజరు నమోదు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆలస్యమవుతోంది. మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యం అందిస్తున్నారు. ప్రతి నెలా పాఠశాలకు అందిన అన్ని బియ్యం బస్తాలపై క్యూఆర్ కోడ్లను ఉపాధ్యాయులు స్కాన్ చేసి ఆన్లైన్లో నమోదు చేయాలి. వంటకు ముందు ఆ బస్తా తెరిచిన ప్రతిసారీ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి, బియ్యం నాణ్యతను పరిశీలించి ఆన్లైన్లో నమోదు చేయాలి. బియ్యం, సరుకులు, యూనిఫారం, పాఠ్య పుస్తకాల వంటివి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి తెచ్చుకోవడం తదితర పనులను ఉపాధ్యాయులే చేయాల్సి వస్తోంది. వివిధ పనులకు సంబంధించి ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులు 500 నుంచి వెయ్యి వరకూ ఫొటోలు అప్లోడ్ చేయాల్సి వస్తోందనీ వాపోతున్నారు. ఇంటర్నెట్, సర్వర్ సమస్యతో ఇవి ఏ సమయానికి అప్లోడ్ అవుతాయో తెలియని పరిస్థితి నెలకొందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల టీచర్ల సమయం వృథా అవుతోంది. మరోవైపు లీడర్షిప్ ట్రైనింగ్ రెండో విడత నిర్వహిస్తున్నారు. మండల స్థాయిలో హెచ్ఎంలు, ఎంఇఒలు గంటల తరబడి ఈ సమావేశాల్లో పాల్గొనాల్సి వస్తోంది. ఈ నెల 4 నుంచి ఎఫ్ఎ-1పరీక్షలు ఉన్నందున సిలబస్ పూర్తి చేయాల్సి ఉందని, ఇన్ని పనుల కారణంగా బోధన సక్రమంగా జరగడం లేదని ఉపాధ్యాయులు అంటున్నారు. ఈ నేపథ్యంలో బోధనేతర పనులు తప్పించాలని, పాఠాలు చెప్పుకొనివ్వండి అంటూ మొరపెట్టుకున్నారు.

పాఠాలు మాత్రమే చెబుతాం

పాఠశాలలోకి సెల్ ఫోన్ పట్టుకొని వెళ్లకుండా కేవలం పాఠాలు మాత్రమే పిల్లలకు చెబుతాం. ఫేషియల్ హాజరు కోసం ప్రభుత్వం టాబ్ లు సరఫరా చెయ్యాలి. పాఠశాలల్లో బోధనా సమయం హరించేలా ఉపాధ్యాయులకు అనేక బోధనేతర పనులను ప్రభుత్వం అప్పగిస్తోంది. సెల్ఫోన్ తోనే అన్ని యాప్లు వినియోగించేలా చేయడంవల్ల విద్యార్థుల విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయి.

- జెవిఆర్కె ఈశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

మమ్మల్ని పాఠాలు చెప్పుకోనివ్వండి

ఉపాధ్యాయులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. అయినా విధులకు హాజరై ఆటు ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడంతోపాటు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఉపాధ్యాయులపై కక్షగట్టినట్లుగా వ్యవహరిస్తోంది. యాప్లు, ఆన్లైన్ పనుల భారం ఎక్కువగా ఉంటోంది. బదిలీ ఉపాధ్యాయులకు రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వట్లేదు. ఇన్ని సమస్యలతో ఉపాధ్యాయులు నలిగిపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

- టి.సన్యాసిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రధానోపాధ్యాయులు సంఘం

మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి

- రైతులను నట్టేట ముంచే విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వం
- ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపుసూర్యనారాయణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఎపి రైతుసంఘం, కౌలు రైతుసంఘం, పాల రైతుల సంఘం ఆధ్వర్యాన శుక్రవారం కెఎల్పురంలోని ఎన్పిఆర్ భవనంలో స్వామినాథన్ శత జయంతి సభ జరిగింది. ఈ సందర్భంగా మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ జాతీయ వ్యవసాయ కమిషన్ ఛైర్మన్గా రైతులకు గిట్టుబాటు ధర కోసం సి-2050 ఫార్ములాను రూపొందించి ప్రభుత్వం ముందుంచారని గుర్తుచేశారు. రైతులను ఆదుకుంటామని కేంద్రంలో అధికారం చేపట్టిన బిజెపి, రైతులను నట్టేట ముంచే విధానాలను అవలంభిస్తోందని దుయ్యబట్టారు. పంటలు పండే భూములను కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతున్నాయని, దీనికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వంత పాడుతోందని విమర్శించారు. స్వామినాథన్ ప్రఖ్యాత విదేశీ సంస్థల్లో, గుర్తింపు, పొందిన శాస్త్రవేత్తల నేతృత్వంలో ఐరోపాలో పనిచేసి సకల సౌకర్యాలను విడిచిపెట్టి భారతదేశానికి వచ్చారని చెప్పారు. ప్రముఖ వరి పరిశోధన కేంద్రం కటక్ పరిశోధకునిగా మొదలుపెట్టి అఖిల భారత స్థాయిలో ఉన్నత స్థాయికి ఎదగడం ఆయన మేదస్సుకు, స్వయం కృషికి నిదర్శనమన్నారు. మన దేశంలో ప్రధాన ఆహార పంటలైన గోధుమ, వరి అధిక దిగుబడులు సాధించడంలో ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు ఐక్యరాజ్యసమితి ద్వారా మొదటి ప్రపంచ ఆహార పురస్కారం అందుకోవడమే ఆయన కృషికి నిదర్శనమన్నారు. మహిళా రైతుల హక్కుల కోసం, వ్యవసాయరంగ అభివృద్ధి కోసం, సమగ్ర భూ, రైతు, రక్షణ సమస్యలపై రాజ్యసభ సభ్యునిగా ప్రస్తావించిన ఘనత స్వామినాథన్కే దక్కుతుందన్నారు. వ్యవసాయ రంగంలో ఆయన చేసిన సిఫార్సులను ఆమలు చేయించుకోవడమే ఆయనకు ఘన నివాళి అని అన్నారు. ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.గోపాలం , కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాకోటి రాములు, తొత్తడి పైడిపు నాయుడు , పాల రైతుల సంఘం జిల్లా కార్యదర్శి గొంప కృష్ణమూర్తి, లోకవర పు ఆది నారాయణ మూర్తి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కురిమినేని వెంకట రమణ, కొత్తలి ఎర్రి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'బాల పురస్కార్'కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల కోసం ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఐసిడిస్పీడీ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా, విజ్ఞానం కళలు, ఆటలు ఇతర రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, ఐదేళ్ల నుంచి 18 సంవత్సరాలలోపు వారు సాధించిన సంబంధిత సర్టిఫికెట్, పత్రికల్లో ప్రచురితమైన పేపర్ క్లిప్పింగ్లు తదితర సర్టిఫికెట్లతో https://award.gov.in వెబ్సైట్ నుండి ఆన్లైన్ చేసుకోవాలని తెలిపారు.

ప్రచార సామగ్రిని ఆవిష్కరిస్తున్న కమిషనర్ నల్లనయ్య, తదితరులు

స్వాతంత్ర్య దినోత్సవ ఔన్నత్యాన్ని

భావితరాలకు అందించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్వాతంత్ర దినోత్సవ ఔన్నత్యాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. శుక్రవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రచార సామగ్రిని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారతదేశానికి స్వేచ్ఛ వాయువులు లభించి ఆగస్టు 15 నాటికి 79 సంవత్సరాలు పూర్తి కావస్తుందని అన్నారు. ఈ సందర్భంగా హర్ ఘర్ తరంగా పేరిట వివిధ కార్యక్రమాలు రూపొందించామన్నారు. వివిధ ప్రాంతాల్లో సెల్ఫీ స్టాండ్లను అమర్చామని చెప్పారు. సెల్ఫీ స్టాండ్ లో క్యూఆర్ కోడ్ ఉంటుందని, సెల్ఫీ తీసుకున్న ప్రతి ఒక్కరూ క్యూఆర్ కోడ్ కు తమ సెల్ఫీ ఫోటోను పంపాలని కోరారు. ప్రశంస పత్రాలను కూడా డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. నేటి నుండి ఆగస్టు 15 వరకు వివిధ రూపాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిపిఆర్ఒ సింహాచలం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధిలో తమదైన ముద్ర వేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిఎస్డిఒగా ఇటీవల నియమితులైన కె. శ్రీధర్ను పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేసారు. అనంతరం దయానంద్ మాట్లాడుతూ క్రీడాభివృద్ధిలో జిల్లాను ముందు స్థానంలో నిలిపి తమదైన ముద్ర వేయాలని కోరారు. ఇటీవల నిర్వహించిన పారా జూనియర్, సబ్ జూనియర్స్ జిల్లా స్థాయి పోటీలకు సంబంధించిన వివరాలను ఆయనకు తెలియజేసారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల కంటే అత్యధికంగా పారా క్రీడాకారులు ఉమ్మడి విజయనగరం జిల్లా నుండి పాల్గొన్నారని అన్నారు. జిల్లాలో ప్రతిభ గల వికలాంగ క్రీడాకారులకు కొదవ లేదని, నిరుపేద కుటుంబాలకు చెందిన వీరికి ఆర్థికంగా ప్రోత్సహిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని తెలిపారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో గల పారా క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందేలా చూడాలని కోరారు.

జిందాల్ నిర్వాసితులకు అండగా ఉంటాం

వినియోగదారుల హక్కుల మండలి జాతీయ అధ్యక్షులు వికాస్ పాండే

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ నిర్వాసితులకు అండగా ఉంటామని వినియోగదారుల హక్కుల మండలి జాతీయ అధ్యక్షులు వికాస్ పాండే ప్రకటించారు. మండలంలోని బొడ్డవరలో 48 రోజులుగా శాంతియుతంగా నిరసన చేపడుతున్న జిందాల్ నిర్వాసితులను శుక్రవారం ఆయన కలిసి, వారి పోరాటానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వికాస్ పాండే మాట్లాడుతూ జిందాల్ నిర్వాసితులకు పూర్తి అన్యాయం జరిగిందన్నారు. మీ భూముల్లో మీరు స్వేచ్ఛగా తిరగలేకపోవడం కచ్చితంగా మానవ హక్కుల ఉల్లంఘనేనని అభిప్రాయ పడ్డారు. మీరు చేసే పోరాటం ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, కంపెనీకి వ్యతిరేకం కాదని, హక్కుల కోసం ఉద్యమిస్తున్నారని, త్వరలోనే న్యాయం చేకూరుతుందని చెప్పారు.

జిందాల్ నిర్వాసితులకు కచ్చితంగా తిరిగి భూమి వస్తుందని, లేకుంటే ప్రస్తుతమున్న రేట్ల ప్రకారం డబ్బులు రావాలని తెలిపారు. జాతీయస్థాయిలో నిర్వాసితులకు కావాల్సిన పూర్తి సహకారాన్ని అందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో న్యాయం జరగకపోతే, దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసన తెలపడానికి రావాలని ఆయన.. నిర్వాసితులకు సూచించారు. కేంద్రమంత్రుల సహాయ సహకారాలు కూడా మీకు ఉంటాయని హామీ ఇచ్చారు.

జిందాల్ నిర్వాసితులతో మాట్లాడుతున్న వినియోగదారుల హక్కుల మండలి జాతీయ అధ్యక్షులు వికాస్ పాండే

10న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-గజపతినగరం

సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి రేవంత్ తెలిపారు. స్థానిక మెంటాడ రోడ్ లో ఉన్న ప్రభుత్వ పాఠశాల వద్ద ఎన్టిఆర్ బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో జరగనున్న ఈ శిబిరంలో రక్తదాతలు, యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రక్తదానం చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని, 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం వలన ఆపద లో ఉన్నవాళ్ళకి ఆదుకున్నవారం అవుతామని తెలిపారు.

రహదారి భద్రతకు ప్రత్యేక డ్రైవ్

ఎస్పి వకుల్ జిందల్

ప్రజాశక్తి- కంటోన్మెంట్

రహదారి భద్రతను దృష్టిలో పెట్టుకొని, రోడ్డు ప్రమాదాలను నియంత్రించడమే లక్ష్యంగా ఈనెలలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు ఎస్పి వకుల్జిందల్ తెలిపారు. డ్రంకన్ డ్రైవ్, ఓవర్ స్పీడు, హెల్మెట్ ధారణ, బ్లాక్ స్పాట్స్ వద్ద ఎన్ఫోర్సుమెంట్ కేసులు నమోదు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఎస్పి ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఎస్ఐ నుండి పైస్థాయి పోలీసు అధికారులు జిల్లాలో ప్రతీ రోజూ ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, నమోదు చేసిన కేసులు వివరాలను జిల్లా కేంద్రానికి తెలియజేయాలని ఆదేశించామన్నారు. ఒక్కొక్క వారం రహదారి ప్రమాదాలకు ప్రధాన కారణాలైన ఒక్కొక్క అంశంపై దృష్టి పెట్టి, ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. ఇందులో భాగంగా డ్రంకన్ డ్రైవ్, అతి వేగం, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అతివేగంతో వాహనాలను నడిపి ఇతర వాహనదారులకు లేదా ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేసే వాహనదారులపై కఠినంగా వ్యవహరించి, కేసులు నమోదు చేయాలన్నారు. హెల్మెట్ ధరించడం వలన కలిగి ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రమాదాలు తరుచూ జరుగుతున్నట్లుగా గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద రహదారికి ఇరువైపులా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాలు జరగడానికి కారణాలను గుర్తించి, ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు బ్లాక్ స్పాట్స్ వద్ద స్పీడు బ్రాకర్లను, స్టావర్లను ఏర్పాటు చేయాలని తెలిపారు.

ఆరు తులాల బంగారం అప్పగింత

ప్రజాశక్తి-కంటోన్మెంట్

పోగొట్టుకున్న బంగారు ఆభరణాలను అందిస్తున్న ఎస్ఐ సురేంద్ర

నగరంలోని కామాక్షి నగర్కు చెందిన పిల్ల పద్మ సొంత పనులు నిమిత్తం గురువారం సాయంత్రం కామాక్షినగర్ వద్ద ఆటో ఎక్కి రైల్వే స్టేషన్ వద్ద దిగిపోయారు. ఆమె ఆటోలో బ్యాగు మర్చిపోయినట్లుగా తరువాత గుర్తించి, వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వన్ టౌన్ సిఐ ఆర్.వి.ఆర్.కె.చౌదరి ఆదేశాలతో వన్ టౌన్ క్రైమ్ ఎస్ఐ సురేంద్ర నాయుడు, సిబ్బంది వెంటనే ఆటోను ట్రేస్ చేసేందుకు చర్యలు చేపట్టారు. పోలీసులు చేపట్టిన చర్యలలో భాగంగా దగ్గరలో లభించిన సిసి టివి ఫుటేజ్ ఆధారంగా ఆటోను ట్రేస్ చేయగా, ఆటోలో బ్యాగు లభించింది. అనంతరం, బ్యాగును అందులోగల ఆరు తులాల బంగారు ఆభరణాలను క్రైమ్ ఎస్ఐ సురేంద్ర నాయుడు బాధితురాలైన పిల్ల పద్మకు వన్ టౌన్ పోలీసు స్టేషన్లో అప్పగించారు. ఆటో డ్రైవర్ కూడా ఆటో వెనుక ఉన్న బ్యాగును గుర్తించలేనట్లుగా పోలీసులు తెలిపారు.

టిడ్కో ఇళ్ల కోసం 11న ధర్నా

ప్రజాశక్తి-బొబ్బిలి

టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని ఈ నెల 11న మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు తెలిపారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించకున్నా బ్యాంకులు బలవంతంగా వారి ఖాతాల నుంచి డబ్బులు కట్ చేస్తున్నాయని తెలిపారు. గత టిడిపి హయాంలో ఇళ్ల నిర్మాణం ప్రారంభించారని, నేడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి మౌలిక సౌకర్యాలు కల్పించి లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్లను అప్పగించకపోవడంతో పేదలు అద్దెఇళ్లలో నివాసముంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 11న చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు యుగంధర్, వాసు ఉన్నారు.

10న జిల్లా స్థాయి యోగా పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యోగాసన పోటీల బ్రోచర్ను ఆవిష్కరిస్తున్న మజ్జి శశిభూషణరావు

జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగాసన పోటీలు ఈ నెల 10న నిర్వహించనున్నారు. విజయనగరం బస్టాండ్ పక్కన గల మెసానిక్ టెంపుల్ ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుండి ప్రారంభమవుతాయని అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మజ్జి శశిభూషణ్ రావు ప్రకటించారు. శుక్రవారం పోటీలకు సంబంధించిన బ్రోచర్ను విడుదల చేశారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన పోటీదారులు రాష్ట్రస్థాయి, అనంతరం జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అవుతారని ఆయన పేర్కొన్నారు. పోటీలు 10 విభాగాలలో, 10 నుండి 55 సంవత్సరాల వయస్సు గల పురుషులు, మహిళలు పాల్గొంటారని తెలిపారు. పోటీలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వడ్లమాని నరసింహమూర్తిని 77021 34568 నంబర్ ద్వారా సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన సభ్యులు వడ్లమాని నరసింహమూర్తి, కార్యదర్శి పి.సత్యనారాయణ, డి.శివ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరేనా?

14 నెలల పాటు ఒక్క ఇల్లూ నిర్మించని ప్రభుత్వం

ప్రజాశక్తి - కంటోన్మెంట్

గత ఎన్నికల ముందు పేదోడి ఇంటి కల నెరవేర్చడం లక్ష్యమని అప్పటి ప్రతి పక్ష నేత.. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనేక సభల్లో అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒక్క ఇల్లు కూడా నిర్మించకపోవడంతో పేదల సొంతింటి కల నెరవేరుతుందా అనే చర్చ సాగుతోంది.

జిల్లా గృహ నిర్మాణ సంస్థ కార్యాలయానికి ఆయా సచివాలయం నుంచి ఇళ్లు మంజూరు చేయాలంటూ 36,541 దరఖాస్తులు వచ్చాయి. గ్రామీణ ప్రాంతాల్లో 34,782 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా పట్టణ ప్రాంతాల్లో 1754 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరందరూ ఇళ్ల స్థలాలు ఉండి ఇళ్లు నిర్మించుకునేందుకు చేసుకున్న దరఖాస్తులు. మరోవైపు ఇళ్ల స్థలాల కోసం 5711 దరఖాస్తులు వచ్చాయి. ప్రతి సచివాలయంలో నిరంతరం ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు అని జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారులు చెబుతున్నారు.

గృహనిర్మాణ సంస్థ కార్యాలయం

14 నెలల పాటు కాలయాపన

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు అయ్యింది. నాటి నుంచి పేదల ఇళ్ల కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. కానీ ఇంత వరకు ప్రభుత్వం ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదు. దీంతో ప్రజల్లో అసంతృప్తి నెలకొంది.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఇళ్ల మంజూరు

ప్రభుత్వం నుంచి ఇళ్ల నిర్మాణానికి ఆదేశాలు రాగానే మంజూరు చేస్తాం. జిల్లాలో ఇంతవరకు ఇళ్ల నిర్మాణం కోసం 36,541 దరఖాస్తులు వచ్చాయి. 1009 ఇళ్ల మంజూరుకు ఉత్తర్వులు వచ్చాయి. ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే నిర్మాణాలు చేపడతాం.

- గండి మురళీమోహన్, హౌసింగ్ పీడీ

ఆర్‌విజికె రంగారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

బొబ్బిలి ప్రాంత అభివృద్ధికి కృషి

ఆర్‌విజికె రంగారావు జయంతి సభలో ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

తన తండ్రి ఆర్.వి.జి.కె రంగారావు బొబ్బిలి ప్రాంత అభివృద్ధికి కృషి చేశారని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. పట్టణంలో శుక్రవారం ఆర్‌విజికె రంగారావు జయంతి సభను నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. బొబ్బిలి ప్రాంత విద్యార్థులకు విద్యను అందించేందుకు అప్పటిలో రాజా కళాశాల, బ్రాంచ్ హైస్కూల్, సంస్థానం పాఠశాల ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. రైతుల కోసం చక్కెర పరిశ్రమలు ఏర్పాటు చేశారని చెప్పారు. క్రీడల పట్ల ఆసక్తి చూపేవారని చెప్పారు. అనంతరం రాజా కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెస్ట్‌ను ప్రారంభించి ఆయన సేవలను వివరించారు. తండ్రి ఆశయ సాధనకు పని చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్, టిడిపి పట్టణ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుబంధానికి ప్రతీక రాఖీ పూర్ణిమ

జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

అన్నా చెల్లెల్లు, అక్క తమ్ముళ్ళ అనుబంధానికి ప్రతీక రాఖీ పూర్ణిమ అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోదరీమణులు సోదరుల ముంజేతికి కట్టే రక్షా బంధనం, వారి కష్ట సుఖాల్లో తోడుగా నిలిచి రక్షణ ఇస్తుందన్న నమ్మకం ఉందని తెలిపారు. రాఖీ పండగ సందర్భంగా అక్కాచెల్లెమ్మలకు ఆయన ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగను ప్రతీ కుటుంబం ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. సమాజంలో సామరస్యం, ప్రేమ, ఐక్యతను ప్రోత్సహించడంలో ఈ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని శ్రీనివాసరావు తెలిపారు.

వేపాడ : మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన ఎంపిటిసి పిల్ల లక్ష్మికి బ్రహ్మకుమారీలు శుక్రవారం రాఖీ కట్టి, రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

చీపురుపల్లి : చీపురుపల్లిలోని ప్రజాపిత బ్రహ్మకుమారిస్ సేవా కేంద్రంలో రక్షాబంధన్ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పరిసర గ్రామాల నుంచి విచ్చేసిన బ్రహ్మకుమారీలకు బ్రహ్మకుమారిస్ సేవా కేంద్రాల జిల్లా ఇన్‌ఛార్జి బికె అన్నపూర్ణ రాఖీ కట్టారు. కార్యక్రమంలో సేవా కేంద్ర ఇన్‌ఛార్జి బికె శాంతి తదితరులు పాల్గొన్నారు.

దళిత యువకుడిపై దాడి అమానుషం

ప్రజాశక్తి-చీపురుపల్లి

తిరుపతిలోని వైసిపి నాయకులు భూమన కరుణాకర్ రెడ్డి కార్యాలయంలో దళిత యువకులను బంధించి, స్పృహ కోల్పోయినట్టు క్రూరంగా కొట్టడం అమానుషమని టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. . చీపురుపల్లిలో తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నాగార్జున మాట్లాడారు. యువకులును దారుణంగా ఇబ్బందులకు గురిచేసి తీవ్రంగా కొట్టి వీడియోలు తీసి సామాజిక మాధ్యమాలలో పెట్టి ప్రజల్లో భయ ఆందోళనలను కలిగిస్తున్నారు అన్నారు. వైసిపి దళిత ద్రోహి పార్టీ అని విమర్శించారు. కరోనా సమయంలో మాస్క్ అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్‌ను అన్యాయంగా హింస పెట్టి మరణం సంభవించినట్లు చేశారన్నారు. అమాయక ప్రజలపై దౌర్జన్యాలు, రౌడీయిజం చేస్తే సహించేది లేదని నాగార్జున అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని అన్నారు.

గిరిజనులతో మాట్లాడుతున్న పోలీసులు

రేగపుణ్యగిరిలో కార్డాన్ సెర్చ్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని శృంగవరపుకోట పంచాయతీ పరిధిలోని రేగ పుణ్యగిరి, గిరిలోవ గ్రామాల్లో సిఐ నారాయణమూర్తి ఆధ్వర్యాన శుక్రవారం కార్డాన్ అండ్ సెర్చ్ కార్యక్రమం చేపట్టారు. గిరిజనుల వద్ద నాటు తుపాకులు ఉన్నాయేమోనని అనుమానంతో సోదాలు చేశారు. ఎస్ఐ, పది మంది సిబ్బందితో కలిసి రెండు గ్రామాల్లో సుమారు 65 ఇళ్లల్లో, ఆ గ్రామాల పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఆయా గ్రామాల గిరిజనులతో సమావేశం ఏర్పాటు చేసి, నాటు తుపాకులు కలిగి ఉండడం నేరమని సిఐ తెలిపారు. నాటు తుపాకులు ఉంటే పోలీసులకు అప్పగించాలని కోరారు.

13న క్రీడా పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

హాకీ లెజెండ్ మేజర్ ధ్యానచంద్ జన్మదినం సందర్భంగా జాతీయ క్రీడాదినోత్సవంలో బాగంగా అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాంశాల్లో 22ఏళ్ల లోపు వారికి ఈనెల 13న జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు డిఎస్‌డిఒ కె.శ్రీధరరావు తెలిపారు.ఉదయం 8 గంటల నుండి స్థానిక విజ్జి స్టేడియం పోటీలు ప్రారంభమవుతాయని, ఆసక్తి గలిగిన అథ్లెటిక్స్ హాజరు కావాలని తెలిపారు.

వీధి దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధిలోని ఏడో వార్డులో కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ చొరవతో వీధి దీపాలు ఏర్పాటుచేశారు. వార్డులో గత నాలుగేళ్లుగా కరెంటు స్తంభాలు విరిగిపోయి ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ ఆధ్వర్యంలో కొత్తగా కరెంటు స్తంభాలు, లైన్లు మార్పు చేశారు. వీధి లైట్లు ఏర్పాటుచేసినా అధికారులు క్లాంపులు, రాడ్లు ఇవ్వకపోవడంతో కౌన్సిలర్ ప్రసాద్ సొంత నిధులతో లైట్లు బిగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల నుండి పన్నులు వసూలు చేస్తున్న ప్రభుత్వం కనీస మౌలిక వసతులు కల్పించకపోతే ఎలా? అని ప్రశ్నించారు. భవిష్యత్తులో వార్డు సమస్యలు పరిష్కరించి, అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

వార్డులో వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్న కౌన్సిలర్

చీరలు పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో పికెఆర్ పురం పంచాయతీ పరిధిలో గిరిజన మహిళలకు శుక్రవారం కెజియు ఫౌండేషన్ ఆధ్వర్యాన చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కెజియు ఫౌండేషన్ ప్రతినిధులు బి.ప్రసాద్‌రావు, గమ్మెల చిన్నమ్మి, జి.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియులో చేరిన ఆటో, క్యాబ్ డ్రైవర్లు

- ఆటో డ్రైవర్ సమస్యలపై 11న ధర్నా
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తోటపాలెం ముత్యాలమ్మ గుడి దగ్గర గల ఆటో స్టాండ్ డ్రైవర్లు శుక్రవారం సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహన్, కార్యదర్శి బి.రమణ ఆధ్వర్యాన సిఐటియులో చేరారు. ముందుగా సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఇందులో పాల్గొన్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ రవాణా రంగంలో ఆటో డ్రైవర్లు చాలా కీలకపాత్రపోషిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న భారతీయ న్యాయ సంహిత (బిఎన్ ఎస్) చట్టం వల్ల డ్రైవర్లు అనేక ఇబ్బందులు పడతారని తెలిపారు. జీవో నెంబర్ 21 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం విపరీతమైన పెనాల్టీలు జరిమానాలు, ఈ చలాన పేరుతో పెద్ద ఎత్తున వేస్తున్నారని అన్నారు. ప్రవేట్ ఫిట్నెస్ సెంటర్ రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వమే బ్రేకు, పొల్యూషన్, రెన్యువల్, గ్రీన్ టాక్స్ మొదలైనవి బాధ్యత పడాలని డిమాండ్ చేశారు. .అలాగే ఓబర్, ఓలా రాపిడో వంటి కార్పొరేట్ యాప్‌లను రద్దుచేసి ప్రభుత్వమే కేరళ తరహాలో కార్మికులకు యాప్ ను రూపొందించాలన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభిస్తున్నందున ఆటో డ్రైవర్లు నష్టపోకుండా ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ఆదుకోవాలతని కోరారు. ఈసమస్యల పరిష్కారానికి ఈనెల 11న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాంబాబు, ఎం.రవి, పి.ప్రసాద్, బి.అప్పలరాజు, జి.నాగరాజు, హేమంత్, చుక్కా శ్రీను, త్రినాథ్, ఎం.శ్రీను,కే.దుర్గ, నాని తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం, గజపతినగరంలో యూనియన్‌లో చేరిన ఆటో, క్యాబ్ డ్రైవర్లతో సిఐటియు నాయకులు

సిఐటియులో క్యాబ్ డ్రైవర్లు చేరిక

గజపతినగరంరూరల్ : గజపతినగరం హైవేలో ఉన్న టాటా ఎసి మ్యాక్స్ క్యాబ్ డ్రైవర్లు శుక్రవారం సిఐటియులో చేరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. టాటా ఎసి మ్యాక్స్ క్యాబ్ యూనియన్ అధ్యక్షులు పి.అప్పారావు ముందుగా జెండావిష్కరణ చేశారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ రవాణా రంగంలో టాటా ఎసి మ్యాక్స్ క్యాబ్ డ్రైవర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రయాణికులను గమ్యస్థానాలకు సకాలంలో చేర్చడంలో వీరి పాత్ర చాలా కీలకంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) చట్టంతో డ్రైవర్లు అనేక ఇబ్బందులు పడతారని చెప్పారు. జిఒ 21 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం విపరీతమైన పెనాల్టీలు విధించడం దారుణమన్నారు. ప్రయివేట్ ఫిట్నెస్ సెంటర్ రద్దుచేసి, రాష్ట్ర ప్రభుత్వమే బ్రేకు, పొల్యూషన్, రెన్యువల్, గ్రీన్ టాక్స్ బాధ్యత పడాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఈ నెల 15 నుంచి అమలు చేస్తున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ఈ డ్రైవర్లను ఆదుకోవాలని కోరారు. వెంటనే వాహనమిత్ర ద్వారా రూ.15 వేలు చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈ నెల 11న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టాటా ఎసి మ్యాక్స్ క్యాబ్ యూనియన్ కార్యదర్శి టి.సూర్యనారాయణ, యూనియన్ నాయకులు బాలరాజు, వెంకట్రావు, సాయి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఫైలుకు ఒక రేటు

వేపాడ తహశీల్దార్ కార్యాలయం

ప్రజాశక్తి-వేపాడ

ఆ కార్యాలయంలో ఏ పని కావాలన్నా.. ప్రతి ఫైలుకు ఒక రేటు నిర్ణయించారు. జనన, మరణ ధ్రువపత్రాలు కావాలన్నా, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ (ఎఫ్‌ఎంసి) ఇవ్వాలన్నా నిర్ణయించిన రేటు ఇస్తేనే ఫైల్ ముందుకు కదులుతుంది. లేదంటే అంతే సంగతి!. 'మీరిచ్చిన ఆధారాలు సరిగా లేవు. తిరస్కరణకు గురైంద'ని మొహమాటం లేకుండా ముఖం మీదే చెప్పేస్తారు. అనుకున్న రేటు ఇచ్చి వేస్తే, తిరస్కరించినట్లు ఫైలు గంటలోనే అయిపోతుంది. ఇదీ వేపాడ మండల రెవెన్యూ కార్యాలయంలో సాగుతున్న బాగోతం. భూముల విషయానికి వస్తే, రియల్ ఎస్టేట్ వ్యాపారులు వచ్చి, ఎంతో కొంత ఇచ్చుకొని పనులు చేసుకోవడం అలవాటైపోయింది. సాధారణ రైతులైతే కాళ్లరిగేలా తిరిగినా పనులు మాత్రం కావడం లేదు. ఇటీవల కాలంలో జనన ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు పెట్టి కాళ్లరిగేలా తిరిగినా పనిమాత్రం కావడం లేదు. గ్రామ రెవెన్యూ అధికారిని అడిగితే, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ని అడగండని చెబుతున్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో దందా!

ఎంఆర్‌ఐని అడిగితే, విఆర్‌ఒ ఇంకా తన వద్దకు ఫైల్ పంపించలేదనడం.. ఇదే తంతు. గట్టిగా అడిగితే ఆర్‌డిఒ కార్యాలయంలో రిజెక్ట్ అయిందని, తామేమీ చేయలేమని చెబుతున్నారు. మరి కొంతమంది అడిగితే దానికి కొంత సమయం పడుతుందంటూ వాటిని పక్కన పడేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సర్టిఫికెట్ల కోసం తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దిగువస్థాయి అధికారులు ఇబ్బంది పెడుతున్నారని తహశీల్దార్‌కు తెలియజేస్తే, తరువాత ఆ అధికారులు కక్షగట్టి పనులు చేయరని, దీంతో వారు అడిగినది ఇచ్చుకోక తప్పని పరిస్థితి నెలకొందని పలువురు రైతులు, బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ కార్యాలయంలో కిందిస్థాయి అధికారే దందాకు ఆద్యం పోశారని, తహశీల్దార్ సైతం ఆ ఉద్యోగిని కట్టడి చేయడం లేదని పలువురు వాపోతున్నారు.

డబ్బులు అడిగితే చర్యలు తప్పవు

కార్యాలయానికి ఏ ఫైల్ వచ్చినా వెంటనే పరిష్కరించడం నా బాధ్యత. కిందిస్థాయి అధికారులు, సిబ్బంది రైతులను, ప్రజలను డబ్బులు అడిగితే నా దృష్టికి తీసుకువస్తే, శాఖా పరమైన చర్యలు తీసుకుంటాం. ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు.

- జె.రాములమ్మ,
తహశీల్దార్, వేపాడ మండలం

ఇన్‌ఛార్జితోనే నెట్టుకొస్తున్నారు

రెండేళ్లుగా ఎపిఒను నియమించని వైనం

ప్రజాశక్తి-డెంకాడ

డెంకాడలోని ఉపాధి హామీ కార్యాలయం

ఉపాధి హామీ కార్యాలయంలో ఎపిఒను నియమించడంపై ఉన్నతాధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారా? అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. ఆ కార్యాలయానికి ఎపిఒ లేకుండా ఇన్‌ఛార్జి పాలనతో రెండేళ్ల నుంచి కాలం గడుపుతుండటమే అందుకు కారణం. ఉపాధి హామీ కార్యాలయానికి పనులపై ఎవరు వెళ్లినా ఎపిఒ లేరని చెప్పి తప్పించుకుంటున్నారు. దానివల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎపిఒ లేకుండా రెండు సోషల్ ఆడిట్లు కూడా తూతూ మంత్రంగా నిర్వహించారు. ప్రస్తుతం మండలంలో ఉపాధి హామీ ద్వారా సిసి రోడ్లు, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. మరికొన్ని చోట్ల ఉపాధి హామీ నిధులతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ సమయంలో కూడా ఎపిఒ లేకపోవడం కాంట్రాక్టర్లు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇన్‌ఛార్జి ఎపిఒ ఒకరోజు వస్తే, మరోరోజు రావడం లేదని పనులపై వెళ్తే కార్యాలయంలో దొరకడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఈ సమయంలో కూడా పర్మినెంట్ ఎపిఒను నియమించక పోవడం ఏమిటని ప్రజలు వాపోతున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎపిఒ రెండేళ్ల క్రితం బదిలీపై వెళ్ళిపోయారు. అప్పటినుంచి ఇప్పటివరకు పర్మినెంట్ ఎపిఒ లేకుండా ఇన్‌ఛార్జి ఎపిఒతో కాలం గడుపుతున్నారు. కూటమి నాయకుల్లో సమన్వయం లోపించడంతో ఎపిఒను నియమించ లేకపోతున్నారని, ఇది కూడా ఒక కారణమని మండల ప్రజలు అంటున్నారు. ఉపాధి హామీలో చేసిన పనులకు ఎపిఒ లేకుండా మూడో సారి కూడా సోషల్ ఆడిట్ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. పర్మినెంట్ ఎపిఒ లేకపోవడంతో ఉపాధి లబ్ధిదారులకు కూలి డబ్బులు చెల్లించడంలోనూ జాప్యం జరుగుతుందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ఎపిఒని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యే ప్రజాదర్బార్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు శుక్రవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు తన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుండి వచ్చిన వినతులు స్వీకరించి, వాటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. విజయనగరం పట్టణం 25వ డివిజన్ సున్నంబట్టీల వీధికి చెందిన దేవవరపు సంతోష్ 2018 లో బాక్సింగ్ పోటీలలో పాల్గొనేటప్పుడు ప్రమాదవశాత్తు తలకి దెబ్బ తగిలి బ్రెయిన్, కాళ్ళు, చేతులు పనిచేయకుండా పూర్తిగా మంచానికే పరిమితమై ఉన్నాడని, ప్రస్తుతం అతనికి రూ. 6 వేలు పింఛను వస్తుందని, మందుల ఖర్చులకు సరిపోవడం లేదని, రూ. 15 వేల రూపాయల పింఛను ఇచ్చి ఆదుకోవాలని తండ్రి కృష్ణ కోరారు.



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అదితి

సుపరిపాలనతోనే అభివృద్ధి

సుపరిపాలనతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 37వ డివిజన్‌లో మహిళా ప్రాంగణం, బిసి కాలనీలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం బిసి కాలనీ హెల్త్ సెంటర్ జంక్షన్‌లో సమావేశం నిర్వహించారు. అనంతరం ముడిదాం గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు.

మలుపులతో పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి-వేపాడ

సింగరాయి వెళ్లే మార్గంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

మండలంలో ఆనందపురం-సోంపురం ప్రధాన రహదారి నుంచి సింగరాయి గ్రామానికి వెళ్లే మార్గంలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. సుమారు రెండు కిలోమీటర్ల మేర ఉండే ఈ రోడ్డులో నాలుగైదు చోట్ల మలుపులున్నాయి. మలుపుల వద్ద ప్రమాదకరంగా తుప్పలు, పిచ్చిమొక్కలు పెరిగి ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించే అవకాశం లేకుండా పోయింది. దీంతో ప్రమాదానికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. ఎదురెదురుగా వాహనాలు తప్పించాలన్నా ఒకవైపు లోతైన పెద్ద గడ్డ, మరొకవైపు లోతైన పొలాలు ఉన్నాయి. దీంతో ఏమాత్రం పక్కకు ఒరిగినా ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నట్లే. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగక ముందే రోడ్డుకు ఇరువైపులా ఉన్న జంగిల్స్ తొలగించి, తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తెలుగు యువత మండల అధ్యక్షులుగా మౌళివర్మ

ప్రజాశక్తి-డెంకాడ

తెలుగు యువత భోగాపురం మండల అధ్యక్షులుగా సిరివూరి మౌళివర్మ ఎంపికయ్యారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మౌళివర్మను నియమిస్తూ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు ప్రకటించారు. మౌళివర్మ 15 ఏళ్లుగా పార్టీకి సేవలందించినట్లు ఆయన తెలిపారు. మౌళివర్మ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

మొక్కలు నాటిన గ్రీన్‌బెల్ట్

ప్రజాశక్తి-బొబ్బిలి

పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని రాణి మల్లమ్మదేవి పార్కు గట్టుపై పట్టణ సిఐ కె.సతీష్ కుమార్, సభ్యులు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలని సిఐ కోరారు. కాలుష్యం నివారణకు గ్రీన్ బెల్ట్ సొసైటీ కృషి చేస్తుందని అధ్యక్షులు ఎస్‌వి రమణమూర్తి చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు. గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్వీ రమణమూర్తి ఆధ్వర్యంలో మున్సిపల్ పార్క్ గట్టుపై ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బొబ్బిలి సిఐ కె.సతీష్ కుమార్ తమ చేతుల మీదుగా మొక్కను నాటి నీరు పోశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పుల్లెల శ్రీనివాసరావు మాట్లాడుతూ మొక్కలు నాటి దానిని సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి అనిల్, కె.సత్యరాజు, ఉపాధ్యాయులు జి.రామారావు, బాల భాస్కరరావు, ఎం.గౌరు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మొక్కకు నీరు పోస్తున్న సిఐ సతీష్

పురిటిపెంటలో చోరీ

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

మండలంలోని పురిటిపెంట గ్రామంలో దొంగతనం జరిగింది. ఎస్ఐ కిరణ్ కుమార్ నాయుడు కథనం ప్రకారం... మామిడిబంద కాలనీలో నివాసముంటున్న బెహరా వెంకట కృష్ణ శేఖర్ ఇంట్లో గురువారం ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారు. బీరువా తాళాలు పగలగొట్టి సుమారు నాలుగు తులాల బంగారు ఆభరణాలు దొంగలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించింది.

ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

నేరాలు ఘోరాలు

రెండు గేదెలు మృత్యువాత

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరు గ్రామంలో కింతాడ సత్యారావు, సాకలి సత్యారావుకు చెందిన రెండు గేదెలు విషాహారం శుక్రవారం తిని మృత్యువాత పడ్డాయి. గుర్తుతెలియని వ్యక్తులు వాటికి ఆహారంలో విషం కలిపి పెట్టడంతో మరణించాయని రైతులు చెబుతున్నారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ నాయకులు బుద్ధ అప్పలనాయుడు కోరారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT VIZIANAGARAM
A.R.B.O.P 01/2020

Between:
Bhogi Srivani .....Petitioner/Appellant
And:
1. M/s Shriram City Union Finance Limited and 4 others ......Respondents

2nd Respondent : Yarangula Srinivasa Rao S/o Bhasakar Rao, Hindu, aged about 40 years, residing at door no 2-9-32. Bondada Veedhi, Vizianagaram. 535002

పై నెంబరు కేసులో 2వ రెస్పాండెంటకు కోర్టువారు ఎన్నిసార్లు నోటీసులు పంపినసూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం పైన తెలిపిన 2వ రెస్పాండెంటకు పైన తెలిపిన కోర్టువారి ఎదుట **ది. 14-08-2025 సం॥రం॥తేదిన ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయముగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరు అయ్యి తమ వాదన వినిపించవలెనని ఈ ప్రకటన ద్వారా తెలియ జేయడమైనది. లేని యెడల మిమ్ములను ఎక్సుర్టిగావించి మీపరోక్షమున పై కేసును కోర్టు వారు పరిష్కరించగలరని తెలియజేయడమైనది.

NAMMI LAXMAN KUMAR,
CHINTALA MAHESH
ADVOCATES, VIZIANAGARAM,
CELL: 9542244448, 9704692210

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT KOTHAVALSA
E.P.2/2025 O.S. No.150/ 2022

Between:
1.Smt. Korukonda Demudamma...DHr/ Plaintiff
And:
Smt. Turpati Venkata Lakshmi & 2 others ....JDr/Defendants

To,
JDr-1: Smt. Turpati Venkata Lakshmi, W/o. Late T.A.S.Karunakarudu, Hindu, aged 53 years, House Wife, R/o. D.No.4-21, B.C.Colony, Golzam Village, L.Kota Mandal, Vizianagaram District-535161

JDr-2: Turpati Sunitha D/o.Late T.A.S.Karunakarudu, Hindu, aged 32 years, -Rest Do-

JDr-3: Turpati Sai, S/o. Late T.A.S.Karunakarudu, Hindu, aged 28 years, -Rest Do-

NOTICE

Please take court notice/summons that the above E.P. is filed against the JDrs/defendants 1 to 3 who succeeds the estate of the deceased Turpati Appala Sanyasi Karunakarudu, before the Hon'ble Junior Civil Judge Court at Kothavalasa for sale property on the strength of decree for recovery of money of Rs.13,00,000/- (Rupees Thirteen Lakhs only) in the above suit, in spite of I filed batta to the JDrs several times but not served as such the honorable court pleased to order to serve the summons/ notice under substituted service to the above stated JDrs 1 to 3.

Therefore, hereby, informing JDrs 1 to 3 of you that the above matter is posted to **22-08-2025** for your appearance before the Honourable junior Civil Judge at kothavalsa at **10-30 A.M.** If you fail to attend on that day, the matter will be heard and decided exparty.

(By Court Order)

J.V.V.JAGADEESWARA RAO
K.Atchibabu and M(J) Srilakshmi
Advocates,Visakhapatnam.
Cell: 9246616118